చెత్త వేయకుండా కట్టడి చేయాలి


వాకర్స్‌కు సూచనలిస్తున్న డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్ : కాలనీవాసులు పార్కు స్థలాల్లో చెత్తాచెదారాలు వేయకుండా కట్టడి చేయాలని గాజులరామారం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. యండమూరి లే అవుట్ పార్కులో వాకర్స్‌తో మాట్లాడారు. దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చంద్రగిరి నగర్ ప్రాంతంలో పర్యటిస్తుండగా.. ఓ ఇంటి ఆవరణలో చెత్త వేయడాన్ని గుర్తించి సదరు యజమానితో మాట్లాడారు. ఇంట్లో ఎంత మంది ఉంటారని, అద్దెకు ఇచ్చిన గదులు ఎన్ని అని ఆరా తీశారు. చెత్తను చెత్తబుట్టలో వేసి రిక్షా కార్మికుడికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో జవాన్ జిలానీ, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు


నూతన కార్యవర్గ సభ్యులకు నియామకపత్రాలు అందజేస్తున్న మల్లారెడ్డి

నిజాంపేట్: పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు కూడా గుర్తింపు లభిస్తుందని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా అధికార ప్రతినిధిగా చక్రధర్, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్‌గా శేషారావు నాగిశెట్టి, బిల్డర్ సెల్ కన్వీనర్‌గా పద్మప్రసాద్, లింగ్విస్టిక్ సెల్ కన్వీనర్‌గా సమీర్‌సౌరభ్‌లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌యాదవ్, జిల్లా జనరల్ సెక్రెటరీ విఘ్నేష్ , జిల్లా కో కన్వీనర్ పద్మయ్య, ఎం.ఎస్. వాసుల, నరహరి, తేజ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ జిల్లా కార్యదర్శిగా తిరుపతి

చింతల్: బీజేపీ అర్బన్ జిల్లా కార్యదర్శిగా చింతల్ డివిజన్‌కు చెందిన కె.తిరుపతి నాయుడు నియమితులయ్యారు. కుత్బుల్లాపూర్ బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ ఇన్‌చార్జి జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి నియామకపత్రాన్ని ఆయనకు అందజేశారు.

ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటుపై పరిశీలన


రోడ్డు విస్తరణ, ట్రాఫిక్ సిగ్నల్ విషయమై మాట్లాడుతున్న టౌన్ ప్లానింగ్ ఏసీపీ సంతోష్

సుభాష్‌నగర్: గాజులరామారం చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటుపై శుక్రవారం బాలనగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సంతోష్ విద్యుత్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. రామారావు చౌరస్తా రోడ్డులో అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపునపై ప్రస్తావించారు. అదేవిధంగా రామారావు చౌరస్తా నుంచి కూకట్‌పల్లి వెళ్లే 60 ఫీట్ల రోడ్డును 100 ఫీట్లుగా చేయాలని నిర్ణయించారు. త్వరలో సిగ్నల్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతి

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ గౌడ సంక్షేమ సంఘం ప్రతినిధులు మేడ్చల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కల్లుగీత సొసైటీ 40 సంవత్సరాల నుంచి ఒక కుటుంబం చేతిలోనే ఉందని వివరించారు. శాశ్వత గుర్తింపు మెంబర్లుగా వారిని నియమించి పలువురికి అన్యాయం చేస్తున్నారని అన్నారు. వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పూర్తి విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కూన రాజ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న గౌడ సంక్షేమ సంఘం ప్రతినిధులు

సేవలను సద్వినియోగం చేసుకోవాలి


చిన్నారులకు ఆట వస్తువులు అందజేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. అమ్మమాట– అంగన్‌వాడీ బాటలో భాగంగా శుక్రవారం బాచుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. చిన్నారులకు ఆట వస్తువులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెండున్నర సంవత్సరాల నుంచి ఐదేళ్ల చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అంగన్‌వాడీ సేవలను చిన్నారులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ కృష్ణారెడ్డి, సీతారామిరెడ్డి, సత్తిరెడ్డి, ఏ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లను కేటాయించాలి

నిజాంపేట్: అర్హులైన పేదలకు రాజీవ్ గృహకల్పలో ఇళ్లను కేటాయించాలని సీపీఐ నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్న వారితో కలిసి శుక్రవారం బాచుపల్లి మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంపేట్‌లోని రాజీవ్ గృహకల్ప పేరిట 103 బ్లాక్‌లను నిర్మించి 3296 మంది లబ్ధిదారులను గతంలో ఎంపిక చేసి ఇళ్లను కేటాయించారని గుర్తు చేశారు. అందులో 45 మందికి వివిధ కారణాలతో కేటాయింపు చేయలేదని, దీంతో అధికార పార్టీ నాయకుల అండతో అర్హతలేని వారు ఇళ్లను కబ్జా చేసి ఉంటున్నారని తెలిపారు. వారిని గుర్తించి అర్హులైన పేదలకు ఇళ్లను కేటాయించాలని కోరారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

చోరీ ఫోన్ అప్పగింత.. నగదు రివార్డు


శివకుమార్‌యాదవ్‌కు నగదు పారితోషికాన్ని అందజేస్తున్న ట్రాఫిక్ సీఐ

సుభాష్‌నగర్: చోరీకి గురైన ఓ బస్సు ప్రయాణికుడి మొబైల్‌ను తిరిగి అందజేసిన పెలికాన్ సిగ్నల్ వాలంటీర్‌ను జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ నగదు రివార్డుతో సత్కరించారు. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం ఉదయం చింతల్ నుంచి గండిమైసమ్మకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఓ వ్యక్తి మొబైల్‌ను బోరబండకు చెందిన సాయి దొంగతనం చేశాడు. ఇది మరో ప్రయాణికుడు చూడటంతో సాయి బస్సు నుంచి దూకి పారిపోవడానికి యత్నించాడు. ఆ సమయంలో సూరారం సిగ్నల్స్ వద్ద విధులు నిర్వహిస్తున్న పెలికాన్ సిగ్నల్ వాలంటీర్ శివకుమార్‌యాదవ్ సమయస్ఫూర్తితో సాయిని అదుపులోకి తీసుకున్నాడు. మొబైల్‌ను పోగొట్టుకున్న వ్యక్తికి అప్పగించారు. దీంతో శివకుమార్‌యాదవ్‌కు జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ నగదు పారితోషికంతో సత్కరించారు.

ఆలయంలో కార్పొరేటర్ పూజలు

జగద్గిరిగుట్ట : డివిజన్ పరిధిలోని సోమయ్యనగర్, నల్లపోచమ్మ ఆలయంలో శుక్రవారం కార్పొరేటర్ జగన్ పూజలు నిర్వహించారు. బోనాల ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఆలయానికి మైక్‌సెట్ సమర్పించిన దాతలను సన్మానించారు. కార్యక్రమంలో సోమయ్యనగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడు తోక యాదగిరి, ఆలయ చైర్మన్ సతీష్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.





ఇతిహాసాల నుంచి పోటీ పరీక్ష పుస్తకాల వరకు..

వీర బ్రహ్మంగారి తాళపత్ర గ్రంథం సైతం

పరిశోధకులు, రచయితలకు మార్గదర్శి సుందరయ్య లైబ్రరీ


సుందరయ్య లైబ్రరీలో పుస్తకాలను పరిశీలిస్తున్న అప్పటి మంత్రి సబితా ఇంద్రా రెడ్డి(ఫైల్)



గచ్చిబౌలి: కమ్యూనిస్ట్ యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య పేరిట నెలకొల్పిన లైబ్రరీ నేటి తరానికి విజ్ఞానగనిగా మారింది. ఇతిహాసాలు, తాళపత్ర గ్రంథాలు మొదలు ఎన్నో పుస్తకాలను ఈ లైబ్రరీలో భద్రపరిచారు. నాటి చరిత్ర, సంస్కృతిపై పరిశోధన చేయాలన్నా, ఓ రచన చేయాలన్నా అక్కడికి వెళ్లే వారు ఎందరో ఉన్నారు. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని సుందరయ్య లైబ్రరీ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి మనోధైర్యాన్ని ఇస్తోంది.

2012 నుంచి అందుబాటులోకి..

2007లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి నాలుగున్నర ఎకరాల స్థలం కేటాయించారు. భవన నిర్మాణం పూర్తయ్యాక 2012లో అప్పటి మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సీపీఎం నేత సీతారం ఏచూరి దీనిని ప్రారంభించారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషలలో రెండు లక్షల 80 వేల పుస్తకాలు అందుబాటులో ఉంచారు. కనుమరుగైన పత్రికలు, ఎన్నో గ్రంథాలు, నవలలు ఈ లైబ్రరీలో ఉన్నాయి. కారల్ మార్క్స్ కలెక్షన్ వాల్యూమ్స్, లెనిన్, స్టాలిన్ వాల్యూమ్స్‌లో పాటు మహాత్మగాంధీ, అంబేడ్కర్ వాల్యూమ్స్, ఈపీడబ్ల్యూ (ఎకనామికల్, పొలిటికల్ వీక్లీ) లా బుక్స్, చిల్డ్రెన్స్ స్టోరీస్, పోతులూరి వీర బ్రహ్మంగారు రాసిన తాళపత్ర గ్రంథాలు భద్రపరిచారు.


తెలుగు ఇతిహాసాలు

పరిశోధన కోసం..

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ, ఓపెన్ యూనివర్సిటీ, అగ్రికల్చర్ యూనివర్సిటీ, బిట్స్ పిలానీకి చెందిన రీసెర్చ్ స్కాలర్స్, ప్రొఫెసర్లు, రచయితలు ఈ లైబ్రరీకి వస్తుంటారు. సివిల్స్, గ్రూప్స్ ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు కూడా నిత్యం వస్తుంటారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు లైబ్రరీలో ప్రిపేర్ అవుతున్నారు. రూ.500 చెల్లిస్తే సంవత్సరం మొత్తం పుస్తకాలు చదువుకునేందుకు వీలుంటుంది. నెలకు రెండు వేలు చెల్లించిన వారికి వైఫై అవకాశం కల్పిస్తారు.

పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా

పోటీ పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్నాను. ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు సుందరయ్య లైబ్రరీలో చదువుకుంటాను. నా వద్ద ఉన్న మెటీరియలే కాకుండా లైబ్రరీలోని పుస్తకాలను తీసుకుంటాను. మార్కెట్‌లో లేని ఎన్నో పుస్తకాలు ఇక్కడ ఉన్నాయి. – గౌతమి

కంప్యూటరైజ్ చేస్తున్నాం



సుందరయ్య లైబ్రరీలోని పుస్తకాలను 2015 నుంచి కంప్యూటరైజ్ చేస్తున్నాం. కవర్ పేజీ నుంచి చివరి పేజీ వరకు ప్రతి పేజీని స్కానింగ్ చేస్తున్నాం. పీడీఎఫ్ ఫైల్ తయారు చేసి వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇప్పటి వరకు దాదాపు 20 వేల పుస్తకాలను వెబ్ సైట్‌లో ఉంచాం. రెండు స్కానింగ్ మిషన్‌ల ద్వారా నిత్యం ఏడుగురు పని చేస్తున్నారు. మరో సంవత్సరంలో తెలుగు పుస్తకాలను వెబ్ సైట్‌లోకి తీసుకొస్తాం.

–అనిల్, సుందరయ్య లైబ్రరీ ఇన్‌చార్జ్

త్వరలో మున్సిపల్ కార్మికులకు తీపి కబురు

జగద్గిరిగుట్ట: త్వరలో మున్సిపల్ కార్మికులకు(ఔట్ సోర్సింగ్) ప్రభుత్వం తీపి కబురు అందిస్తుందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్యగౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. జగద్గిరిగుట్టలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు జనార్దన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులు సకలజనుల సమ్మెలో కీలకంగా పని చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో గూడ వరమ్మ, యాదగిరి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

కుత్బుల్లాపూర్: దోమల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంటమాలజీ అధికారి ఉమారాణి అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలోని దరహాస పాఠశాలలో విద్యార్థులకు దోమల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల ధర్నా

నిజాంపేట్: బాచుపల్లిలోని శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ విద్యార్థులు శుక్రవారం ఆందోళనకు దిగారు. యూనివర్సిటీలో వసతులను మెరుగుపర్చాలని పలుమార్లు ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు వీసీ, రిజిస్ట్రార్‌లకు వినతిపత్రం అందజేశారు. అయినా పరిపాలనా విభాగం అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు యూనిర్సిటీ అడ్మినిస్ట్రేటీవ్ కార్యాలయం ఎదుట 300 మంది విద్యార్థులు బైఠాయించారు. యూనివర్సిటీలో అంతర్గత రోడ్లు నడవడానికి వీలు లేకుండా మారాయని, విద్యార్థుల భద్రతకు సరైన చర్యలు చేపట్టడం లేదన్నారు. దీనిపై యూనివర్సిటీ డీన్ స్పందించి.. విద్యార్థుల సమస్యలను రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ

కుత్బుల్లాపూర్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అప్పుడే చాలా వరకు రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం కొంపల్లిలోని శివశివానీ డిగ్రీ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవన్నారు. దీని వల్ల ఇతరులకు ఇబ్బందిగా మారుతుందన్నారు. అనంతరం ఇటీవల చోటుచేసుకున్న పలు ప్రమాదాలను వీడియోల ద్వారా విద్యార్థులకు చూపించారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే కలిగే దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆనందరెడ్డి, అధ్యాపక బృందం, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ సందర్భంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్ ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జీడిమెట్ల ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జీడిమెట్ల గ్రామం, భీమా ప్రైడ్, గ్రీన్ పార్క్, 11కేవీ మీనాక్షి ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మీనాక్షి ఎస్టేట్స్, స్ప్రింగ్‌ఫీల్డ్‌కాలనీ, 11కేవీ బాలాజీ ఆసుపత్రి ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు కాస్ హోటల్ లేన్, అంగడిపేట, కాంటన్ పార్క్, శ్రీని అవెన్యూ, 11కేవీ జయరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జయరామ్‌నగర్, శ్రీకృష్ణనగర్, గణేష్‌కాలనీ, 11కేవీ వైష్ణవి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12:30 నుంచి 1 గంట వరకు రంగారెడ్డి బండ, వైష్ణవి ఎన్‌క్లేవ్, కల్యాణ్ కన్‌స్ట్రక్షన్స్, గంగాఎన్‌క్లేవ్, 11కేవీ సెయింట్ ఆన్స్‌ఫీడర్ పరిధిలో సెయింట్స్ ఆన్స్ స్కూల్, పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్, ఎస్‌సీఎల్ సౌత్, 11కేవీ రామరాజునగర్ ఫీడర్ పరిధిలో గ్రీన్ పార్క్, ప్రపూర్ణ ఎన్‌క్లేవ్, రామరాజునగర్, 11కేవీ సత్యం ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1 గంట నుంచి 1:30 గంటల వరకు ఎస్‌సీఎల్ సింధు, దండమూడి ఎన్‌క్లేవ్, సురక్ష ఆసుపత్రి, ఆర్టీఏ కార్యాలయం తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ తెలిపారు..

కొంపల్లి సెక్షన్ పరిధిలో...

◆ 11కేవీ అపర్ణ, గార్డెన్ సొసైటీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12:30 నుంచి 1 గంట వరకు అపర్ణ పామ్‌గ్రోవ్, వెంకటేశ్వర కాలనీ, దేవేందర్ కాలనీ, మికాసా స్టెర్లింగ్, సెంట్రల్‌పార్క్, 11కేవీ దూలపల్లి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల వరకు దూలపల్లి గ్రామం, అశోక ఏలా మైసన్, 11కేవీ ధోలరీధనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1 గంట నుంచి 1:30 గంటల వరకు ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాలు, శ్రీకాంత్ రెడ్డి ఎస్టేట్స్, పోచమ్మగడ్డ, 11కేవీ జయభేరి, నూజివీడు సీడ్స్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 1:30 నుంచి 2 గంటల వరకు జయభేరి కాలనీ, బ్యాంక్ కాలనీ, శ్రీనివాస నగర్, అశ్విని కాలనీ, గ్రీన్‌కౌంటీ, సిల్వర్ నెస్ట్, 11కేవీ ఎన్‌సాయి ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సినీ ప్లానెట్, ఎస్‌సీఎల్ నార్త్, 11 కేవీ విఘ్నేశ్వర ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుండి 11:30 గంటల వరకు దుర్గాహోటల్ ఏరియా, 11కేవీ కొంపల్లి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1 నుంచి 1:30 గంటల వరకు కుమ్మరి బస్తీ, మున్సిపల్ కార్యాలయం, ఆంధ్రబస్తీ, సెంట్రల్ పార్క్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని కొంపల్లి ఏఈ పేర్కొన్నారు.

నిజాంపేట్: చెట్ల కొమ్మల తొలగింపు సందర్భంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ప్రగతినగర్ ఏఈ సమ్మయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ డాక్టర్స్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు, 11కేవీ జగన్ స్టూడియో ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 11కేవీ భౌరంపేట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల వరకు, ఆర్‌జీకే ఫీడర్ పరిధిలో 12:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11కేవీ ప్రగతినగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1:30 నుంచి 2 గంటల వరకు, మిథిలా నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1:30 నుంచి 3 గంటల వరకు, 11కేవీ డాక్టర్స్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు శిల్పా లేఅవుట్, డాలర్‌హోమ్స్, ఎన్‌ఆర్‌ఐ కాలనీ, సాయికృష్ణ కాలనీ, లహరిగ్రీన్‌పార్క్, ఇందిరమ్మకాలనీ, ఎస్‌ఆర్‌కే వెంచర్, వాసవీ లేఅవుట్, అంబ భవనీహోటల్, ప్రగతి సెంట్రల్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

మదర్సాలో ప్రత్యేక ప్రార్థనలు



నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని మదర్సాలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మేయర్ నీలారెడ్డి, కార్పొరేటర్లు ఆగం పాండు, కాసాని సుధాకర్, బాలాజీ నాయక్, కాసాని వీరేశ్ చాదర్ కప్పి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రేపు శ్రీ ఐశ్వర్యాంబిక తపోవనంలో గురుపౌర్ణమి వేడుకలు

సాక్షి, సిటీబ్యూరో : సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని శ్రీ ఐశ్వర్యాంబిక తపోవనం(త్రిశక్తి పీఠం) పీఠాధిపతి శ్రీ శ్యక్తానందగిరి స్వామి తెలిపారు. పెద్దలను గౌరవించే పద్ధతిని అవలర్చే క్రమంలో గురుపౌర్ణమి వేడుకలను జరుపుకుంటున్నామన్నారు. బాచుపల్లిలోని పీఠంలో ఆదివారం జరిగే ఈ వేడుకల్లో భాగంగా గురు ప్రార్థన, గురుసేవ, పాదపూజ, పుష్పార్చన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

శాకంబరి దేవిగా అమ్మవారు



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్‌లోని రేణుకా ఎల్లమ్మను శుక్రవారం శాకంబరి దేవిగా అలంకరించారు. ఆషాఢమాస శుక్రవారాన్ని పురస్కరించుకుని కాలనీలోని మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రజలకు మరింత చేరువ

కుత్బుల్లాపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీల అమలుతో పాటు రైతు రుణమాఫీ ద్వారా ప్రజలకు మరింత చేరువైందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, నాయకులు షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వెంటనే ఆయన అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం వివిధ కాలనీలలో జరిగే బోనాలు తదితర కార్యక్రమాల బ్రోచర్లను విడుదల చేశారు.

బీజేపీ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధిగా చక్రధర్


నియామక పత్రాన్ని అందుకుంటున్న చక్రధర్

కూకట్‌పల్లి: భారతీయ జనతా పార్టీ(బీజేపీ) మేడ్చల్ మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధిగా రచ్చ చక్రధర్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు డా. ఎస్. మల్లారెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. అదే విధంగా జిల్లా లీగల్ సెల్ కన్వీనర్‌గా శేషారావు నాగిశెట్టి, బిల్డర్ సెల్ కన్వీనర్‌గా సమీర్ సౌరభ్‌లకు నియామక పత్రాలను అందజేశారు.

నిర్మాణ పనులను పూర్తి చేయాలి


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: పైపులైన్ నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలనీలోని మంజీరా పైపులైన్ పనులు, 5వ ఫేజ్, ఎస్‌ఎస్ కాలనీలోని సీవరేజ్ పైపులైన్ పనులను శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో హనుమంతరావు, ఏఈ సాయిప్రసాద్, వాటర్‌వర్క్స్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ


ఎమ్మెల్యే గాంధీని సన్మానిస్తున్న పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీలో చేరిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీని శుక్రవారం శేరిలింగంపల్లి క్రిస్టియన్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో రెవరెండ్ ఎడ్వర్డ్ రాజ్, రెవరెండ్ స్వామి, జార్జ్, జూపాల్, వినయ్ జాన్, ఆర్‌పీ దాస్, రాజు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు గురు పౌర్ణమి వేడుకలు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్ శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి జీఏకే కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగడ హారతి, పంచామృతంతో అభిషేకం, నూతన వస్త్రాలంకరణ, సామూహిక సాయి సత్యవ్రతం, మధ్యాహ్నం హారతి, అన్నదానం, సంధ్య హారతి భజన, పల్లకీ సేవ, పవళింపు సేవతో గురు పౌర్ణమి వేడుకలు ముగుస్తాయని తెలిపారు. అదే విధంగా మోతీనగర్ ప్రధాన రోడ్డులోని విక్రమ్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన షిర్డీ సాయిబాబా మందిరంలో కూడా వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ జి. మాణిక్‌రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు.